# <u>ద్వైతం</u>

వివిన మూర్తి

"అర్జంటుగా రమ్మన్నావు. ఏంటి సంగతి?" - వచ్చి కూర్చుంటూనే ప్రశ్నించాడు కృష్ణ.

"1694లో పుట్టి 1778లో మరణించిన ఫ్రెంచి మహారచయిత వోల్టేర్ ద గుడ్ బ్రాహ్మిన్ అని ఒకథ రాసాడు. తెలుసా?" - అన్నాడు జగన్నాథం.

అతని సంగతి కృష్ణకి తెలుసు. రాత్రని ఉండదు పగలని ఉండదు. ఎప్పుడూ ఆలోచనల మీదనే గాని నేల మీద నడవడు. ఏదో ఆలోచన వచ్చినపుడు స్నేహితులని రమ్మంటాడు, లేకపోతే తనే వస్తాడు. చరిత్ర, సైన్సు, తత్వ శాస్త్రాలు, కవిత్వం ఒకటేమిటి అన్నీ ఆసక్తే. జీవిత తత్వం గురించి మాటలాడే స్నేహితుడు కృష్ణ.

"వోల్టైర్ తెలుసు. కథ గురించి తెలియదు."

"విరాట్ కథ నిన్ను చాలా ప్రభావితం చేసిందని అంటావు గదా?" - అన్నాడు జగన్నాథం.

"ఐతే!"

"ఆ గుడ్ బ్రాహ్మిన్ కథ నేను తెలుగులోకి అనువదించాను. ముందు చదువు." అంటూ కాగితాలు అందించాడు.

-- -- -- --

నేను భారతదేశంలో పర్యటించేటపుడు ఒక పెద్దమనిషిని కలిసాను. అతను ఉన్నత కులస్తుడు. బ్రాహ్మణుడు. బాగా చదువుకున్నవాడు. ప్రజ్ఞావంతుడు. మాటకారి. వీటన్నింటికీ మించి ధనవంతుడు. అందువల్ల కూడా మరింత తెలివైనవాడు. అతనికి ఏ కొదవా లేదు. అందువల్ల ఎవరినీ మోసగించవలసిన అగత్యంలేదు. ముగ్గురు అందమైన భార్యలు. భర్తను సుఖపెట్టటంలో ఆరితేరినవారు. సంసారాన్ని చక్కగా నడిపిస్తున్నారు. భార్యలతో సుఖపడటంలో తీరిక దొరికనపుడు ఆ బ్రాహ్మణుడు తత్వచింతన చేసేవాడు.

అతని ఇల్లు రంగురంగుల పూలూ, ఫలాలతో నిండిన తోట మధ్య, చక్కని అలంకారాలతో కంటికి అందంగా మనసుకు ఇంపుగా ఉండేది. ఆ నివాసానికి సమీపంలోనే ఒక ముసలి భారతీయ మహిళ నివసించేది. ఆమె కటిక పేదరాలు. మూఢురాలు. మూఢవిశ్వాసి.

ఒకరోజు ఆ బ్రాహ్మణుడు నన్నో కుదుపు కుదిపాడు. "నేను పుట్టకుండా ఉండిఉంటే బాగుండేది." అన్నాడు. ఎందుకని ప్రశ్నించాను. జవాబిచ్చాడు.

"నలభై ఏళ్లుగా అధ్యయనం చేస్తున్నాను. అంటే నలభై ఏళ్లు వృథా చేసుకున్నాను. ఇతరులకి బోధిస్తుంటాను. వాస్తవానికి నాకు ఏమీ తెలియదు. ఈ స్థితి నన్ను సిగ్గుపడేలా చేస్తోంది. నామీద నాకు అసహ్యం కలిగిస్తోంది. ఈ జీవితం దుర్భరం అనిపిస్తోంది.

"నేను పుట్టాను. ఒక కాలంలో జీవిస్తున్నాను. కాని కాలం అంటే ఏమిటో నాకు తెలియదు. నేను పదార్థంతో నిర్మితమయాను. ఆలోచించగలను. అయినప్పటికీ ఆలోచన ఎలా ఏవిధంగా పుడుతుందీ నేను తెలుసుకోలేక పోయాను. ఆహారాన్ని జీర్ణించుకోవటం, నడవటం వంటి సరళమైన సామర్థ్యాలవంటిదేనా ఆలోచనా సామర్థ్యం. ఏమో!

నాకు తెలియదు. నాచేతులతో పట్టుకోవటం ఎలా చేస్తున్నానో అలాగే బుర్రతో ఆలోచించటం కూడా చేస్తున్నానా? నా లోపలి ఆలోచనకు మూలం తెలియనట్లే, బయటి దేహం కదలికకి మూలం కూడా నాకు చిక్కుముడే.

"నేనే ఎందుకు ఉన్నానో నాకు తెలియదు. ప్రతిరోజూ ఇలాంటి విషయాలమీద జనం నన్ను ప్రశ్నిస్తూ ఉంటారు. నేను వారికి సమాధానం చెప్పాలి. కాని నా దగ్గర చెప్పదగినది ఏమీలేదు. నేను మాటలాడతాను. మాటలాడతాను. మాటలాడతాను. ఆ ఊకదంపుడు అంతా అయాక గొప్ప సిగ్గు దుఃఖం కలుగుతాయి.

"బ్రహ్మను సృష్టించినది విష్ణువా? లేక ఇద్దరూ కూడా అతీతులా? ఈ ప్రశ్న వేసినపుడు నా పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుంది. నా వెర్రిమొర్రి సమాధానాలలోనే నాకు ఏమీ తెలియదన్న విషయం నాకు తెలిసిపోతూనే ఉంటుంది. అయినా వాళ్లు అడుగతూనే ఉంటారు. "ఓ మహాపండితుడా! ఈ ప్రపంచాన్నంతటినీ పాపం, చెడ్డతనం ఎందుకు ముంచెత్తుతున్నాయో చెప్పండి.

."నన్ను ప్రశ్నిస్తున్నవారికన్న దట్టమైన పొగమంచులో ఉన్నాను నేను. ఒక్కోమారు అంతా మనమంచికే జరుగుతుందని వాళ్లకి బోధిస్తుంటాను. కాని, యుద్ధంలో సర్వం నాశనమైపోయినవారు ఒక్కలిప్తపాటు కూడా దానిని అంగీకరించలేరు. అంతెందుకు నేనే అంగీకరించలేను.

"నా ప్రశ్నలతో, అజ్ఞానంతో ఇంటికి తిరిగివస్తాను. మా ప్రాచీనగ్రంథాలన్నీ తిరగవేస్తాను. అవి నా చీకటిని మరింత చీకటిమయం చేస్తాయి. స్నేహితులని ప్రశ్నిస్తాను. 'జీవితాన్ని కేవలం అనుభవించాలంతే. మానవజాతిని చూసి నవ్వుకోవాలి'. అంటారు కొంతమంది. మరికొంతమంది వాళ్లకేదో కొంత తెలుసంటారు. వాళ్ల మాటలు వింటుంటే వాళ్లెంత వాగాడంబరంతో, డొల్ల భావాలతో నిండిపోయి ఉన్నారో, ఎంత హాస్యాస్పదంగా మాటలాడుతున్నారో క్షణాలలో అర్థమయిపోతుంది. నా సందేహాలను, వేదనను, భావోద్వేగాలనూ ప్రతిదీ పెంచుతూనే ఉంటుంది. ఇంత శ్రద్ధాసక్తులతో అధ్యయనం చేసి, అన్వేషించి కూడా నేను ఎక్కడినుంచి వచ్చానో, నేను ఏమిటో, ఎక్కడికి పోతున్నానో లేదంటే ఈ జన్మ ముగిసిన తర్వాత నేనేమవుతానో తెలుసుకోలేక పోయాననిపిస్తుంది ఒక్కోమారు. అలాంటపుడు నిరాశా, నిస్పృహలతో నిండిపోతాను."

ఆ మంచిమనిషి మనస్థితి నన్ను చాలా బాధించిది. అతనికన్న నిజాయితీగా, హేతుబద్ధతతో మరెవ్వరూ ఉండరనిపిస్తుంది. అతని ఎరుక పెరిగిన కొద్దీ, ఎక్కువ స్పందిస్తున్న కొద్దీ అతని వేదన, దుఃఖం పెరుగుతూనే ఉన్నట్లు అర్థమవుతుంది.

అదేరోజు అతనికి దగ్గరలోనే బ్రతుకుతున్న ముసిలమ్మని కలిసాను. "నీ ఆత్మ ఎలా పుట్టిందో నీకు తెలియనందుకు గందరగోళానికి గురై దుఃఖపడ్డావా?" అని ప్రశ్నించాను. ఆమెకి నా ప్రశ్నే అర్థంకాలేదు. ఆ బ్రాహ్మణుడిని అతలాకుతలం చేస్తున్న అంశాలలో ఏఒక్కదానినీ ఆ ముసిలమ్మ జీవితంలో ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. మహావిష్ణువు అవతారాలన్నింటినీ ఆవిడ మనసారా నమ్మింది. గంగాస్నానం చేసే అవకాశం ఏమాత్రం లభించినా స్త్రీలందరికన్న తాను అదృష్టవంతురాలిననే ఆనందంలో మునిగిపోయేది.

ఆ నిర్భాగ్య ప్రాణి ఆనందానికీ, తృప్తికీ నేను నిర్ఘాంతపోయాను. నా బ్రాహ్మణ తాత్వికుని వద్దకు వచ్చి అన్నాను.

"నీ గడపముందే ఒక ముసలి ప్రాణి ఎలాంటి ఆలోచనలతోనూ సతమతమవకుండా ఆనందంగా బ్రతుకుతుంటే నువ్వింత దుఃఖపడటం సిగ్గుగా లేదా?"

"నువ్వన్నది సరైనదే." అన్నాడు. "నా పొరుగుమనిషిలా అంత మూఢంగా ఉండగలిగితే నేను చాలా ఆనందంగా ఉండగలనని నాకు నేనే వందలాదిసార్లు చెప్పుకున్నాను. అయినప్పటికీ అటువంటి ఆనందంలో నాకు లవలేశం కూడా కోరిక లేదు."

అన్నింటికన్న ఎక్కువగా ఆ బ్రాహ్మణుని మాటలు నన్ను ప్రభావితం చేసాయి. నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. అజ్ఞానంతో బ్రతకటమన్న షరతుపై ఆనందంగా ఉండటాన్ని నేనూ ఏమాత్రమూ కోరుకోను.

ఈ ప్రశ్నను మరికొంత మంది తాత్వికుల ముందు ఉంచాను. వారు కూడా అదే అభిప్రాయాన్ని వెల్లడించారు. "ఏది ఏమైనప్పటికీ ఈ ఆలోచనా విధానంలో చాలాచాలా వైరుధ్యం ఉంది." అంటూ కొనసాగించాను.

ఇంతకీ, ఇందులో అసలు విషయం ఏమిటి? ఆనందంగా ఉండటం. నువ్వు జ్ఞానివా మూఢుడివా అన్నది నిజంగా ఏమంత ప్రధానం? అంతేకాదు, ఎవరైతే తమ మూఢత్వంతో ఆనందంగా, తృప్తిగా జీవిస్తారో వారికి తమ తృప్తి మీద ఎన్నడూ, ఎటువంటి సందేహమూ ఉండదు. ఎవరైతే ఆలోచిస్తారో, హేతువును అన్వేషణ చేస్తారో, విశ్లేషిస్తారో వారు తాము సరైన హేతువుని  కనుగోనగలిగామని ఎన్నడూ అనుకోలేరు.

"మంచి ఆలోచనాశక్తి మనలను దుఃఖమయం చేస్తుంటే అలాంటి శక్తిని మనం ఎంచుకోరాదన్నది సుస్పష్టం." అన్నాను.

అందరూ అంగీకరించారు. అయినప్పటికీ తృప్తికి బదులుగా మూఢత్వాన్ని అంగీకరించేవారు ఇంతవరకూ నాకు ఎదురుకాలేదు. దానితో ఒక విషయం తేల్చుకున్నాను. మనం ఆనందానికి ఎంత విలువ ఇస్తామో అంతకన్న విలువ హేతువుకి ఇస్తాం.

కాని, ఆనందానికన్న హేతువుకి విలువనివ్వటం పూర్తిగా ఉన్మాదమే అన్నది లోతుగా ఆలోచిస్తే అనిపిస్తుంది. ఎన్నో, ఎన్నెన్నో విషయాలలాగే దీనిగురించి కూడా ఇంకా ఇంకా తరచవలసి ఉంది.

-- -- --

"చదివాను" అన్నాడు కృష్ణ సాలోచనగా కాగితాలు పక్కన ఉంచి.

కొద్దిసేపు నిశ్శబ్దాన్ని జగన్నాథమే చెదరగొట్టాడు.

"ఇది చదివిన వెంటనే స్టిఫాన్ త్స్వైక్ కథ విరాట్ గురించి నువ్వు ఊగిపోతూ చెప్పటం గుర్తు వచ్చింది. ఆయన రాసిన కథ పేరు ఇంగ్లీషులో ఏమిటి? ఎప్పుడు రాసాడు?"

"The Eyes of My Brother, Forever. 1925"

"అంటే.. దాదాపు రెండువందల ఏళ్ల అంతరం ఉంది ఈ రెండు కథల మధ్యా. ఆ కథ నీకు పూర్తిగా గుర్తుందా?"

"అక్షరం అక్షరం గుర్తుంది. ఏం నువ్వు మరిచిపోయావా?"

"లేదు. వివరంగా గుర్తు రావటం లేదు. ఆ కథ చెప్పు."

కృష్ణ మాటలాడలేదు.

"ఏంటాలోచన?"

"ఎందుకు ఆలోచిస్తున్నానా అని." నవ్వాడు.

"ఈకథ చదివిన వెంటనే నాకూ అదే ప్రశ్న వచ్చింది."

"విరాట్ కథని ఎందుకు చెప్పమంటున్నావో కాస్తంత అర్థమవుతోంది."

-- -- --

బుద్ధుడు పుట్టక ముందు కాలానికి చెందిన కథ ఇది. వీరవాఘు అనే రాజ్యాన్ని ఒక రాజు పాలిస్తున్నాడు. ఆయనకు కుడిభుజంగా ఉన్న ఒక గొప్ప యోధుడు విరాట్. ఉన్నట్లుండి రాజుగారి బావమరిది, రాజు పట్ల కోపంగా ఉన్న కొండజాతి ప్రజలను తన సైన్యంలో కలుపుకుని, రాజధాని మీదకు దండెత్తాడు. రాజుగారి సేనాపతి కూడా వాళ్లతో చేతులు కలిపాడు. రాజువైపు ఎవరూ నిలవలేదు. అప్పుడు రాజు విరాట్ ఇంటికి వెళ్లి సహాయం కోరాడు. విరాట్ ఆయనకు మాట ఇచ్చి, తన సైన్యంతో వెళ్లి శత్రువులపై పడ్డాడు. అర్థరాత్రి వాళ్ళ గుడారంలోకి ఒంటరిగా దూరి విద్రోహుల తలలు నరికేసాడు. మర్నాడు ఉదయమే వాళ్ళ శవాలు నరికి కాకులకు, గద్దలకు వేయడానికి గుడారంలోకి మళ్ళీ ప్రవేశించాడు. రాజుగారి బావమరిది, సేనాపతి శవాలతో పాటు విరాట్ సోదరుని శవం కూడా అక్కడ పడి ఉంది. అతను ఒక కొండ ప్రాంతపు రాజు. విరాట్ అంటే అమిత ప్రేమ కలవాడు. అతను చనిపోయాడు కానీ అతని కళ్ళు తెరిచే ఉన్నాయి. నువ్వు చేసింది న్యాయమేనా? అని విరాట్ను ప్రశ్నిస్తున్నాయి. ఆ కళ్లు చూసి విరాట్ చలించిపోయాడు.

శవాల్ని ముక్కలు చేయబోతున్న తన సైనికుల్ని వారించాడు. వాటికీ అంత్యక్రియలు జరిపించాడు. రాజుగారి వద్దకు వచ్చాడు. విరాట్ సాధించిన విజయానికి రాజు తన పూర్వీకుల ఖడ్గాన్ని బహుకరించబోయాడు. కానీ విరాట్ తీసుకోలేదు. 'నా తోడబుట్టినవాడిని చంపుకున్నాను. ఇకముందు ఎవర్ని చంపబోయినా నా సోదరుడినే చంపబోతున్నాననే భావన కలుగుతుంది. కత్తి చూపి ఇతరులను భయపెట్టి బతికేకన్నా భిక్షమెత్తుకుని బ్రతకడం మంచిదని నేను నిశ్చయించుకున్నాను' అని విన్నవించాడు. అతని పరిస్థితిని రాజు అర్థం చేసుకున్నాడు. 'నీ వంటి వాడి సేవలు ఈ రాజ్యానికి కావాలి. నువ్వు చెడును గుర్తించగలవు. ఇకపై ప్రధాన న్యాయాధికారిగా ఉండి న్యాయాన్ని కాపాడు' అన్నాడు. విరాట్ సరే అన్నాడు.

ప్రధాన న్యాయాధికారిగా విరాట్ చాలా నియమాలు ఏర్పరచుకున్నాడు. విచారణ జరిపిన వెంటనే తీర్పు చెప్పేవాడు కాడు. ఒక రోజంతా ప్రశాంతంగా ఆలోచించేవాడు. తీర్పు చెప్పేముందు  చేతులు, కాళ్ళు చల్లని నీళ్ళతో కడుక్కొని, మనసుని నిర్వికారంగా ఉంచుకునేవాడు. తీర్పు ముగిసాక, అది సమజసంగా ఉందా అని ముద్దాయినే అడిగేవాడు. దాదాపు అందరూ సమంజసంగా ఉందనేవారు. మరణదండనలు విధించేవాడు కాడు. కానీ శిక్ష కఠినంగా వుండేది. దాంతో నేరస్థులు తగ్గేవారు. ఆరేళ్లలో విరాట్కి ఎంతో ఖ్యాతి లభించింది. అప్పుడో నేరం విచారణకు వచ్చింది.

ఒక గ్రామస్తుడి కూతుర్ని ఒక ఆటవిక యువకుడు ప్రేమించాడు. తండ్రి తన జాతివాడే అయిన మరో గ్రామంలో వున్న వ్యాపారికి కూతుర్నిచ్చి పెళ్లి చేశాడు. కన్యాశుల్కం కోసం కూతుర్ని అమ్ముకున్నాడని ఈ కుర్రవాడు కసి పెంచుకున్నాడు. నవ దంపతులని ఏమీ చేయలేదు కానీ తండ్రిని, సోదరులను, వాళ్ల నౌకర్లను ఇలా పదకొండుమందిని చంపేశాడు. అతన్ని ఆ గ్రామస్తులు బంధించి విరాట్ ముందుకు నిలబెట్టారు. విరాట్ ఆ కుర్రవాడిని – అదంతా నిజమేనా? అని ప్రశ్నించాడు. 'నిజమేదో నీకెలా తెలుస్తుంది? వీళ్ల మాటలు విని నిజాలు తెలుసుకోగల ననుకుంటున్నావు. నా అటవీ న్యాయన్ని నేను అమలు చేశాను. అది నీకు నేరంగా అనిపించినా నేను నీ న్యాయాన్ని అంగీకరించను. నా మీద ఆరోపణ చేసిన వాళ్లనీ, నీ తీర్పునీ నేను ద్వేషిస్తాను.' అన్నాడు ఆ కుర్రవాడు. విరాట్ మర్నాడు తీర్పు చెపుతానన్నాడు. ఆ రోజే తీర్పు చెప్పాలని గ్రామస్థులు పట్టుబట్టారు. విరాట్ చల్లటినీళ్ళతో తనని తాను చల్లబరచుకుని 'జీవితం భగవంతుని అనుగ్రహం. దాన్ని  హరించిన ఈ యువకుడు బయట ప్రపంచంలో జీవించే హక్కు కోల్పోయాడు. పదకొండు మందిని చంపాడు. జైలులో ఉంచండి. ఒక్కో చావుకు వంద కొరడా దెబ్బలు తినాలి.' అన్నాడు.

ముద్దాయి 'నీ దయ నాకక్కరలేదు. నానుంచి హరిస్తున్నదానితో పోలిస్తే నీ దయ ఏపాటిది?' అన్నాడు. అదేమిటంటే 'అవును, నన్ను ఒక్కసారిగా చంపినా న్యాయమే. కానీ ఏళ్ళకు ఏళ్ళు జైల్లో కుళ్ళబెట్టి చంపుతున్నావు. నీ పిరికి హృదయం రక్తపాతాన్ని తట్టుకోలేదు కాబట్టి యిలాటి నిర్దాక్షిణ్యమైన తీర్పులు యిచ్చి ప్రజల యవ్వనాన్ని, ఆరోగ్యాన్ని హరిస్తున్నావు. కొరడా దెబ్బల రుచి ఎలా ఉంటుందో నువ్వు రుచి చూశావా? చెరసాల జీవితం ఎలా వుంటుందో నీకు తెలుసా? మా అడవి మనుషుల కంటె క్రూరుడివి నీవు.' అని ఎద్దేవా చేసాడు.

ఆ ఖైదీ వెళుతూ వెళుతూ చూసిన చూపు – ఆ చూపు చనిపోయిన విరాట్ అన్నగారి చూపులాగానే వుంది – ఆ చూపులా కనిపించింది. ఇక్కడ విరాట్‌కు రక్తం చిందించడం యిష్టం లేదు కాబట్టి ఖైదీలకు వేరే రకమైన శిక్ష విధించాడు అన్నది ఆయువకుని అభియోగం. నిజానికి ఆ శిక్ష కలగజేసే శారీరక, మానసిక బాధ ఎటువంటిదో విరాట్ ఎరగడు. అది స్వయంగా అనుభవిస్తేనే తెలుస్తుంది అనుకున్నాడు. మరునాడు సెలవుపై వెళుతున్నానని అందరికీ చెప్పి, జైలులోని ఖైదీ వద్దకు వెళ్లాడు. అతని బదులు తను ఖైదులో వుంటానని, నెల్లాళ్ల తర్వాత అతను తిరిగి రావాలని ఒట్టు వేయించుకుని బయటకు పంపించాడు. ఈ రహస్యం మనిద్దరి మధ్యనే వుండాలని ఒప్పందం చేసుకున్నాడు. ఖైదీ ఆశ్చర్యపోయాడు. బయటకు వెళ్లాడు.

మర్నాడు విరాట్ కొరడా దెబ్బలు అనుభవించటం మొదలు పెట్టాడు. 70 దెబ్బలు తినేసరికే అంతటి మహా యోధుడూ, బలాఢ్యుడూ మూర్ఛపోయాడు. పాతాళ ఖైదులో జీవితం ఎంత దుర్భరంగా, ఎంత భయానకంగా వుంటుందో అతనికి అనుభవమయింది. తన ప్రాయశ్చిత్త కర్మ అతనికి ఆనందాన్ని, తృప్తినీ కలిగించింది. కానీ 19 వ రోజున హఠాత్తుగా తను విడిపించిన ఖైదీ అన్నమాట ప్రకారం తిరిగి రాకపోతే? అన్న సందేహం పుట్టింది. మనసంతా భయం నిండిపోయింది. దిగులు ఆవహించింది. తన పిచ్చిపనికి దేవుణ్ని, మహారాజుని, గుర్తు వచ్చిన ప్రతీవాడినీ తిట్టుకున్నాడు. తిండి నోటికెక్కలేదు. తల బాదుకున్నాడు. అన్నమాట ప్రకారం ఆ అడవి యువకుడు తిరిగి వచ్చాడు. ఇతన్ని చెర విడిపించాడు. దాంతో విరాట్ న్యాయాలలో ఉన్న తేడాను గుర్తించాడు. తను న్యాయమూర్తిగా పనికిరానని నిశ్చయించుకున్నాడు. ఆ ఉద్యోగం మానేస్తానని రాజుని వేడుకున్నాడు. 'సరే నీ యిష్టం, నాకు ప్రధాన సలహాదారుగా వుండు' అన్నాడు రాజు.

విరాట్ సలహాదారునిగా పేరు తెచ్చుకున్నాడు. సంసారంలో స్థిరపడ్డాడు. కొన్నేళ్ల తర్వాత ఓ సంఘటన జరిగింది. విరాట్ ఇంటి బానిస పారిపోయాడు. విరాట్ కొడుకు అతన్ని పట్టుకుని తెచ్చి రక్తాలు వచ్చేట్లు కొట్టాడు. అది చూసి విరాట్ చలించిపోయాడు. ఆ బానిసకు విముక్తి ఇస్తానన్నాడు. కొడుకులు తిరగబడ్డారు – 'తప్పుచేసినవాణ్ని దండించకపోగా బహుమతి యిస్తాననటావేమిటి? బానిసలు అందరూ విముక్తులైతే యీ పనులన్నీ మేం చేయలా? వాడు సాటి మనిషి, పని చేయించకూడదు అంటావా? అయితే ఎద్దులను మాత్రం కష్టపెట్టడమెందుకు? అవి సాటి ప్రాణులు కావా? వాటి బదులు మనమే పొలం దున్నవచ్చుగదా? ఇంతెందుకు మాకిన్ని నీతులు చెపుతున్నావు. నువ్వెప్పుడైనా నీ పనులు చేసుకున్నావా? ఇతరుల శ్రమపైననే కదా యిన్నాళ్లూ ఆధారపడ్డావు, సుఖంగా బతికావు?' అని నిలదీసారు.

'పాపం చెయ్యాల్సిన అవసరం కలిగించే పనులన్నిటినుండీ నేను దూరంగా ఉండదలుచుకున్నాను. మీరు బానిసలందర్నీ విముక్తుల్ని చేయండి. మీకు అవసరమైన పనుల్ని మీరే చేసుకోండి' అని తన పిల్లల్ని ఆదేశించాడు. అప్పుడు వాళ్లు - మీరు బానిసల్ని శాసించటం పాపంగా భావిస్తున్నారు. ఒప్పుకుంటాం. అయితే బానిసలని విడిచేయమని మమ్మల్ని మాత్రం ఎందుకు శాసిస్తున్నారు?' అని ప్రశ్నించారు.

విరాట్ ఈ సమస్యకు పరిష్కారం చూపలేక రాజుతో చెప్పి యిల్లు వదిలి, జనాన్ని వదిలి అడవికి వెళ్లిపోయాడు. అక్కడ పక్షులతో సాన్నిహిత్యం ఏర్పడింది. జంతువులతో సాంగత్యం ఏర్పడింది. జీవితానికి లక్ష్యం

ఏర్పడిందని తృప్తిగా, శాంతిగా బ్రతుకుతున్నాడు. ఏడాదిన్నర గడిచాక ఓ వేటగాడి కంటబడ్డాడు. దానితో విరాట్ గురించి అంతటా పేరు పాకింది. సమాజంలో చాలామంది ఆయనని ఆదర్శం చేసుకుని అడవులకు చేరుకోసాగారు. విరాట్ కూడా సమాజంతో పనిబడింది. ఓ రోజు ఓ సాధువు శరీరం తన కుటీరం వద్ద కనబడితే దాని అంత్యక్రియలకై ఊళ్లోకి వెళ్లి జనాల సహాయం అడగవలసి వచ్చింది. అప్పుడు ఓ యిల్లాలు అతనిని దుమ్మెత్తిపోసింది. ఆమె భర్త ఓ సాలెవాడు. డబ్బు సంపాదించి, భార్యను, ముగ్గురు పిల్లలను చక్కగా చూసుకునేవాడు. ఇప్పుడీ విరాట్ ఆదర్శంలో పడి ఇల్లు వదిలిపెట్టి అడవుల్లో కూచున్నాడు. ఆకలికి తాళలేక ముగ్గురు పిల్లలూ మరణించారు. ఇదంతా నీ వల్లనే అంది ఆ యిల్లాలు. ఒక పని చేసేముందు దాని పరిణామాలెలా వుంటాయో అని ఆలోచించలేనివాడివి నువ్వేం మహాత్ముడివి? అని తిట్టిపోసింది. 'ప్రపంచంలోని సమస్త కార్యాలు భగవత్కార్యాలే. ఏ మనిషి కూడా తన యిష్టప్రకారం ఆ పనుల నుంచి ఆ బాధ్యతల నుంచి తప్పించుకునే వీలు లేదు. నీ బుద్ధికి అహంకారం పడితే నీ కర్మలకు నీవే కర్తవు కాగలననుకుంటావు. నీకు అమృతం అయినది మరొకడికి విషం అవుతుంది. అందువల్ల నీ ధర్మం ఏదో తెలుసుకుని ఆచరించు.' అంది.

విరాట్ మళ్లీ ఆలోచనలో పడ్డాడు. రాజు వద్దకు వెళ్లి సన్యాసం వదిలేస్తున్నానని చెప్పాడు. -మానవసేవకు దూరం కావడం తప్పు. పని నిర్వహణ మాత్రమే మన పని. ఫలితం భగవంతుని చేతులో వుంది. పనిలో ఉన్నతమైనది, అల్పమైనదీ ఏదీ లేదు. తర్కించక లభించిన పనిని ఆచరించేవాడే నిజమైన స్వతంత్రుడు.' అన్నాడు. రాజుకి మండింది. -నన్ను సేవించినా కుక్కలను సేవించినా ఒకటే నంటాడా? అనుకుని కుక్కల కాపలాదారుగా నియమించాడు. విరాట్ ఏ మాత్రం అవమానంగా భావించలేదు. సరేనన్నాడు. కానీ కుటుంబానికి అవమానంగా ఉండటంతో వాళ్లు యితన్ని వదిలిపెట్టేశారు. ఇతను నౌకర్ల గదుల్లోనే నివసించాడు. కొంతకాలానికి రాజు మరణించాడు. కొత్తరాజుకి విరాట్ గతం తెలియదు. ఓ సారి ఓ కుక్క అనవసరంగా మొరిగితే కోపం కొద్దీ విరాట్‌ను బెత్తంతో మోదాడు. విరాట్ అనామకుడు ఐపోయాడు. చనిపోయినపుడు బానిసలను దహనం చేసే శ్మశానంలోనే ఆయన్నూ దహనం చేశారు. కుక్కలు మాత్రం రెండు రోజులు తిండీ తిప్పలూ మానేసి రాత్రింబవళ్లు మొరిగాయి. ఆ తరువాత అవి కూడా తమ యజమానిని మర్చిపోయాయి.

-- -- --

కొంతసేపటి వరకూ ఎవరి ఆలోచనలలో వారు ఉండిపోయారు.

"-చిత్రమేంటంటే రాసినవారిద్దరూ యూరోపియనులు. రాసినదానికి ప్రేరణ భారత దేశపు తాత్విక భావనలు. ఇది మనదేశమనీ, ఈ విషయం తెలుసుకుని నేనేం పొంగిపోటంలేదు. నా సంతోషం ఏమిటంటే ఏ భావన అయినా మనిషిది. అది భూమిమీద ఎక్కడైనా పుట్టవచ్చు, మరెక్కడికైనా అది వ్యాపించవచ్చు." అన్నాడు జగన్నాథం.

"నీసంగతి నాకు తెలుసు. వేరే వివరణ ఎందుకు మిత్రమా!"

"రెండు వందల సంవత్సరాల ఎడంలో పుట్టిన ఈ రెండు కథలకీ మౌలిక ప్రశ్న ఒక్కటే. మనిషి జీవితానికి లక్ష్యం ఏమిటి? ఒప్పుకుంటావా?"

"చిన్న సవరణతో.. "

"ఏంటది?"

"నా జీవితానికి లక్ష్యం ఏమిటని ప్రశ్నించుకోగల చైతన్యం ఉన్న, స్వతంత్ర్యాకాంక్ష గల మనుషుల ప్రశ్న."

జగన్నాథం ఆలోచనలో పడ్డాడు.

"అందరు మనుషులకీ వర్తించదంటావు."

"గుడ్ బ్రాహ్మిన్ కథలో మసిలమ్మకి వర్తించుతుందా?"

"ఎందుకు వర్తించదు. ఆమె కూడా జీవిస్తున్నది. ఆమెకీ లక్ష్యం ఉండాలి."

"చూడు జగన్నాథం! మనుషికి ఫలానీ లక్ష్యం ఉండాలని నిర్దేశించటం మతం కోవలోకి వస్తుంది. అది మనిషి స్వతంత్రతను నియంత్రించటం అవుతుంది. కాని తనెలా ఎందుకు బ్రతకాలో ఆలోచించుకోగలవాడు స్వతంత్ర మానవుడు."

"అంటే మనుషుల మధ్య అంతరం ఉందంటావు!!"

"ఉండటం వాస్తవం. ఉండకుండా చేయాలనుకోటం, లేదా తగ్గించాలనుకోటం ఆదర్శం. అంతరాలకు పునాది ఆర్థికం అంటాడు మార్క్స్. పునాదిలో అంతరాలను నియంత్రంచటం ద్వారా మనుషుల వికాశానికి సమాన అవకాశాలివ్వవచ్చన్న ప్రయత్నం కమ్యూనిస్టులది."

"నువ్వు ఎటెటో పోతున్నావు. ఇది ఆలోచనాపరుల మౌలిక ప్రశ్న అన్న ఒప్పందంతో మాటలాడుకుందాం."

"నువ్వేదో ఆలోచన పంచుకోవాలని పిలిచావు. అదేంటో ముందు చెప్పు."

"పంచుకోటం కోసం కాదు. తేల్చుకోటం కోసం."

"సరేనయ్యా మహానుభావా! అదే చెప్పు."

"విరాట్ కథ నీకెందుకు అంతగా నచ్చింది? నిజంగా అది నీ జీవితాన్ని ప్రభావితం చేసిందా? అంటే జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకోటానికి ఉపయోగపడిందా?"

"నువ్వు చెప్పాలనుకున్నదేదో చెప్పగూడదా జగన్నాథం!"

"కాదు. నాకు విరాట్ మీద స్పష్టత కావాలి. నీమీద స్పష్టత కావాలి."

"మొట్టమొదటి సారి ఈకథ చదవేనాటికి నా చదువు పూర్తయింది. తెలుగు నేల మీద నక్సలిజం ప్రభావం ముఖ్యంగా విద్యార్థుల మీద ఉంది. మేధో ప్రపంచం విప్లవాన్ని అత్యంత దగ్గరలో చూస్తోంది. వివాహం ఒక శారీరక అవసరం, దాన్ని వాయిదా వేయగలం, ఇప్పుడున్న వివాహ వ్యవస్థ బానిసల మధ్య ఏర్పాటు వంటి భావాలు ఒకవైపు. ఇందరు దుఃఖితుల్ నడుమ ఏనొకరుండను సౌఖ్యమొందగా డెందము ఒప్పుకోదు.. అంటూ మరొక వైపు. ఆదర్శాల, ఉద్రేకాల ఆధారంగా ఏర్పడిన స్నేహాలు. ఆ స్నేహితుల ప్రవర్తన కలిగించే ప్రశ్నలు, అయోమయం మరోవైపు. ఇన్ని కబుర్లు చెప్పి వీళ్లు ఎందుకు తాగుతున్నారు? నీతిగురించి, పేదతనం గురించి, సమానత్వ పోరాటాల గురించి ఇన్నిన్ని వల్లిస్తూ వ్యభిచరిస్తారెందుకు? తాము చీకటిలో ఉండి వెలుగు నిస్తామని పద్యాలు రాస్తారెందుకు? ఎందుకీ హిపొక్రసీ! ఈ ఆలోచనాపరుల కన్న స్వచ్ఛమైన మనుషులూ; మాటకీ, చేతకీ తేడా ఇంతగా లేని మనుషులూ బయట ప్రపంచంలో నిత్యం ఎదురవుతుంటారు. లోలోపల ఒకవిధమైన కోపం. జుగుప్స. కలవక తప్పదు. కలిసాక తిట్టుకోక తప్పదు. సాహిత్యం, వామపక్ష రాజకీయాలతో సహా ప్రతి ఆచరణ రంగంలోనూ డొల్లతనం.. హిపొక్రసీ.. ఆడంబరం.. సమానత్వాకాంక్షుల్లోని అసమానత్వం.. " ఆగాడు కృష్ణ.

మళ్లీ కొనసాగించాడు.

" అలాంటి సమయంలో త్ర్యేక్ కథ నాకు లభించింది. నాలో అస్పష్టంగా ఉన్న అసలు, సిసలైన మానవుడి రూపాన్ని స్పష్టం చేసిందీ కథ విరాట్. విరాట్ వీరుడు. చేపట్టినది చేస్తున్నపుడూ, దానిలో లోపం కనిపించిన వెంటనే విడిచిపెట్టినపుడూ నాకు ఆ వ్యక్తిలో కనుపించినది చిత్తశుద్ధి, నిజాయితీ. చెట్టుని చెట్టని, రాయిని రాయని చెప్పే ఆదిమ

మానవుడు ఏ అవసరం కోసం వాటిని భగవంతుడన్నాడో, ఆ అవసరాలు మారుతూ వచ్చాయి. అప్పటినుంచి కంటికి కనుపించేదానితో, మనసుకు అనిపించినదానితో సహా ప్రతిదానినీ మరేదోగా చెప్పవలసిన అవసరాలు, ఒత్తిడులు పెరుగుతూ వచ్చాయి. వాటినన్నింటినీ జయించి, వ్యక్తి ఆ చిత్తశుద్ధిని నిలబెట్టుకోటానికి చేసిన పోరాటం ఆ కథలో నాకు కనిపించింది. ఏపని చేయటానికైనా, అది తప్పనిపిస్తే ఒప్పుకుని, మానెయ్యటానికైనా కావలసిన ధైర్యం నాకు ఆకథ ఇచ్చింది. అత్యంత సామాన్యునిగా అనామకునిగా చనిపోవటం సరైన ముగింపు ఆ కథకీ, విరాట్ పాత్రకీ అనిపించింది. మనిషిని కరప్ట్ చేసేవాటిలో అత్యంత శక్తిమంతమైనది గుర్తింపు, కీర్తి".

కొంత ఆలోచన తెమిలాక, జగన్నాధం అన్నాడు.

"నేను నిమిత్తమాత్రుడిని. ముందే నిర్ణితమైన క్రియను నేను కేవలం అమలు చేస్తున్నాను. - అని మనిషి అనుకోవాలని బోధిస్తుంది భగవద్గీత. అది మనిషి కర్తృత్వాన్నీ, జవాబుదారీతనాన్నీ, వివేచననీ కుదించుతుంది. దాని సారాంశమే ఈ కథ."

"ఈ వాదనను నేనూ విన్నాను. గీత మీద నీకు ప్రిజుడీస్ ఉన్నాయి. ఒక పుస్తకంగా దానిలో నీకు పరస్పర విరుద్ధ భావాలు కనిపిస్తాయి. ఆ పుస్తకం ఒకమారే రాయలేదని, ఒక్కరే రాయలేదని నువ్వు లెక్కలు వేస్తావు. అదే పుస్తకాన్ని చదివి అనేకమంది అది తమకు కర్తవ్యోపదేశం చేసిందని, కర్తవ్యోన్ముఖుడిని చేసిందనీ అన్నారు. అది వారి అనుభవమన్నారు. గీత సారాంశమే విరాట్ అయినా నాకు అది వర్జనీయం కాదు. కర్తవ్యం చెయ్యమనే గీత, కర్తవ్యంలో తప్పు కనిపిస్తే వదిలెయ్యమనే విరాట్ ఒకటెలా అవుతాయి? గీత చదివినపుడు నాకు కనిపించని దోవ విరాట్ చదివినపుడు నాకు  కనుపించింది. నేను మనస్పూర్తిగా ఏ పని చేస్తే నాకు తృప్తికలుగుతుందో, దుఃఖం కలగదో, లాభనష్టాల లెక్కలు పక్కనబెట్టి చేసే శక్తి, ప్రేరణ నాకు విరాట్ కథనుంచి లభించింది."

"ఇది నీ అనుభవమంటావు."

"నిస్సందేహంగా."

"నువ్వు అదృష్టవంతుడివి".

"ఏం?"

"కొన్నాళ్లు సందేహాలకు గురయావు. ఏదో రచన తారసపడింది. దోవ కనబడింది. అందులో పోతున్నావు. పోతున్నానను కుంటున్నావు. నీ నిత్య జీవిత వ్యవహారాలలో ఎవరికైనా సాయంచేస్తే తృప్తి. ఒక మంచి రచన చదివితే, సినిమా చూస్తే, ప్రకృతిలో నిలబడితే నీకు తృప్తి. నీతో పోల్చుకుంటే నాకు తృప్తి గగనకుసుమమే."

"గుడ్ బ్రాహ్మిన్ కథలో బ్రాహ్మణుడివన్నమాట".

"అలాగే అనుకో.. బహుశా నువ్వు ఒప్పుకోవేమో.. "

"ఏంటి?"

"18 వ శతాబ్దారంభంలో వోల్టేర్ ఈ కథ రాసాడు. ఆనాటి ప్రపంచానికి మానవజాతి మనుగడపై గల ఆశని ఈ కథ సూచిస్తుంది. అది ఫ్రెంచి విప్లవాన్ని తెచ్చింది. స్వాతంత్ర్యం, సమానత్వం, సహోదరత్వం పొందుతానన్న ఆశతో మానవుడు చక్రవర్తిని నరికాడు. రాజరికాల అంతం వ్యాపారుల విజయమయింది కాని, ప్రజా విజయం కాలేదు. వ్యాపారుల పోటీ సాంకేతిక జ్ఞానాన్ని పెంచింది. పేరాశని పెంచింది. ఈరెంటితో వ్యాపారుల ప్రపంచవ్యాప్త యుద్ధాలు జరిగాయి. వాటి మధ్యలో 20 వ శతాబ్దారంభంలో జ్వైక్ ఈ కథ రాసాడు. ఆలోచనాపరుడు ఎంత ఆలోచించినా, ఆచరణని చేపట్టినా ఉద్దేశిత లక్ష్యాలు కాకుండా విరుద్ధ ఫలితాలు పొందటం అతని అనుభవం. ఈ నిరాశనుంచి విరాట్

వచ్చింది. 21వ శతాబ్దారంభంలో మనం ఈనాడు ఉన్నాం.ఈ రెంటినీ పక్కపక్కని పెట్టి చూసే అవకాశం వచ్చింది. వీటిల్లో ఏది మనకు మార్గదర్శకం కావాలి? ఆశా? నిరాశా?"

కృష్ణ నవ్వాడు.

"????" అన్నట్టు చూసాడు జగన్నాథం.

"ఏదో ఒకటి ఎందుకు మార్గదర్శకం కావాలో చెప్పు?"

"అంటే?"

"నీ వాదనను అంగీకరిస్తే ప్రపంచానికి ఆశా నిరాశా ఉండొచ్చు. కాని వ్యక్తికి తప్పకుండా ఉంటాయి. కాలానికి మాత్రం ఉండవు."

"నువ్వనేది?"

"లక్ష సంవత్సరాల మనిషి ఎన్ని ఒడిదుడుకులు చూసాడు. ఒకచోట పుట్టి ప్రపంచమంతా విస్తరించాడు. పదివేల ఏళ్లుగా వాటిని మాటబద్ధం, తర్వాత అక్షర బద్ధం చేసాడు. ప్రళయంగురించి, ప్రపంచాంతం గురించి ఎన్నెన్ని ఊహలు చేసాడు. ఆఖరిదశ కథలో రావిశాస్త్రిగారు చెప్పినట్టు అదే అంతం అనుకున్నాడు. కాని కాదుగదా? ఆలోచనా, ఆచరణా జమిలిగా కొనసాగటం ఈ రెండు కథల్లోనూ కనబడటం లేదా? దుఃఖం కలిగించినా సరే మనిషి ఆలోచిస్తూనే ఉంటాడు అంటాడు వోల్టేర్ గుడ్ బ్రాహ్మిన్. ప్రతి అనుభవంతో మనిషి మారుతూనే ఉంటాడు అంటాడు త్ర్యైక్ విరాట్. మానవుడు ఈ రెంటి సమ్మేళనం."

--------------- ------------------------ --------------------

VVN MURTHY(phone 9603234566(ap), 9449057022)

112, 3rd BLOCK, VANSHEE RICH FIELD APARTMENTS,

MARATHA HALLI

BANGALORE - 560037